క్లుప్తంగా

కలెక్టర్‌కు అభినందన

పర్వతగిరి : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డాక్టర్ సత్య శారదాదేవికి జెడ్పీ సీఈఓ రాంరెడ్డితోపాటు ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, తదితరులు అభినందనలు తెలిపారు. తొలుత కలెక్టర్‌కు జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ పుష్పగుచ్ఛం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు..



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అఖిల, శ్రీవర్ష ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవగా వారిని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ టెస్‌లో ఏటా స్కూల్ విద్యార్థులు ఎంపికవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఏపీఎం సురేశ్‌కు సన్మానం



గీసుకొండ : మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలను ఇప్పించినందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సెర్ప్ ఏపీఎం సురేశ్‌కుమార్‌ను డీఆర్‌డీఓ కౌసల్యాదేవి మంగళవారం సన్మానించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.30 కోట్ల మేర రుణ లక్ష్యం ఉండగా రూ.53 కోట్ల మేరకు అందించినందుకు ఏపీఎం సురేశ్‌కుమార్‌తోపాటు మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులను మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ అనిత రాంచంద్రన్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా ఇటీవల సన్మానించి అభినందించిన విషయం తెలిసిందే.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గీసుకొండ : నర్సంపేటలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 2006–08 విద్యాసంవత్సరంలో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు మండలంలోని కొమ్మాల గ్రామంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద మంగళవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాజు, రామాచారి, రాజేందర్, వంగ రాజు, విరాట్ రాజు, రమేశ్, రవీందర్, రాజశేఖర్, నాగ ప్రకాశ్, భిక్షం, సాయి, లక్ష్మన్, రమేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత



రాయపర్తి : మండలంలోని జింకురాంతండాకు చెందిన లకావత్ గోజీ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నిత్యావసర సరుకులు పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి పంపిన సరుకులను బాధిత కుటుంబానికి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, కేశవాపురం మాజీ సర్పంచ్ పున్నమయ్య, ధూమ్‌సింగ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మేరుగు సంపత్ ఈనెల 13న తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలై వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్, నాయకుడు రాజు పరామర్శించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఎక్స్‌గ్రేషియా కోసం ఎక్సైజ్ శాఖ, బీసీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. పరామర్శించిన వారిలో నాయకులు మడూరి సోమన్న, జక్కుల మధు, మేరుగు నవీన్, సత్యం, మల్లయ్యలు తదితరులున్నారు.

సత్కారం

ఐనవోలు : టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మంగళవారం ఆయన నివాసంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వర్ధన్నపేట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి మర్యాద పూర్వకంగా కలిశారు. రవీందర్‌రావుకు మొక్కను అందించి శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



నర్సంపేట రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మాదన్నపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామచంద్రు తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆ గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రధానోపాధ్యాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం రామచంద్రు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, తదితరాలు అందిస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంజన్‌కుమార్, ఉపాధ్యాయులు అర్చన, సుధారాణి, అశోక్, వెంకన్న, లీలా, విశాల, సంతోశ్, యాదగిరి, భిక్షం, రమేశ్, అనూశ, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.

భవానీకుంట తండాలో..



రాయపర్తి : భవానీకుంటతండాలో..

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని భవానీకుంట తండాలో స్థానిక ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజయ్య మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, సుధారాణి పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో మోస్తరు వర్షం



చెన్నారావుపేట : మండల కేంద్రంలో వర్షం

చెన్నారావుపేట : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో రైతన్నల్లో, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తక, మొలకెత్తిన మొక్కలు మాడిపోతుండటంతో రైతులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం చల్లబడడంతో పంటలకు జీవం వచ్చిందంటూ రైతులు ఆనంద పడడం కనిపించింది.



సంగెం : రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వృక్షం

రహదారిపై నేలకూలిన భారీ వృక్షం

సంగెం : ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్ సమీపంలోని సంగెం–గవిచర్ల దారిలో భారీ వృక్షం అడ్డంగా నేలకూలింది. రోడ్డుపై వాహనాలు, మనుషులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వరంగల్–మహబుబాబాద్ ప్రధాన రహదారిలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు స్థానికుల సహాయంతో వృక్షాన్ని తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



చెన్నారావుపేట : పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలను హెచ్‌ఎం అంగోతు భద్రయ్య, ఉపాధ్యాయులు మంగళవారం అందజేశారు. అనంతరం హెచ్‌ఎం భద్రయ్య మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, రజిత, పావని, యాకయ్య, అనిత, స్వర్ణలత, రమాదేవి, తదితరులు ఉన్నారు.

మహిళా సంఘం ఆధ్వర్యంలో..

దుగ్గొండి : మండలంలోని మందపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక స్ఫూర్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేలా విద్యార్థులకు మహిళా సంఘం సభ్యులు పుస్తకాలు కొనుగోలు చేసి అందించడం అభినందనీయమని తెలిపారు. గ్రామానికి చెందిన పిల్లలందరినీ ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పేలా మహిళా సంఘం సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ మేదరి పద్మ, వీఓఏ అంబరగొండ మధురాబాయి, ఉపాధ్యాయురాలు నిర్మల, అంగన్‌వాడీ టీచర్ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండిలో..

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని డీఈ శ్రీనివాసరావు ఆదేశించారు. స్కూల్‌లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. మిగిలిన పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట ఏఈ హరిదాస్యం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు వంట పాత్రల అందజేత



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని ధర్మారం జెడ్పీ హైస్కూల్‌కు ఆ పాఠశాల పూర్వవిద్యార్థి సంకతాల సమ్మయ్య తన తండ్రి జ్ఞాపకార్థం మంగళవారం రూ.10 వేల విలువైన వంట పాత్రలను మధ్యాహ్న భోజనం కోసం అందజేశారు. అలాగే పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చక్రవర్తుల శ్రీనివాస్ కొన్ని వంట పాత్రలను అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యుడు కొక్కొండ శ్రీకాంత్, ఉపాధ్యాయులు సూరయ్య, నజీరుద్దీన్, సాంబయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్ననాయకులు

సంగెం : మండలంలోని షాపూర్, లోహిత, రామచంద్రాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని హనుమకొండ డిపో మేనేజర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమిడి అంజన్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం డిపో మేనేజర్‌ను కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించింది. అనంతరం అంజన్‌రావు మాట్లాడారు. గతంలో షాపూర్‌కు బస్ సర్వీస్ ఉన్న రోజుల్లో వల్ల మూడు గ్రామాల రైతులు, విద్యార్థులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేదని చెప్పారు. తదనంతరం బస్ సర్వీస్‌ను నిలిపివేయడంతో ఆయా గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగించలేక చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రైతులు, ప్రజలు సైతం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వెంటనే షాపూర్ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించి ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు దొనికెల శ్రీనివాస్, సత్తయ్య, ఈక బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. యాంత్రీకరణతో గ్రామాల్లో కూలీల పని దినాలు తగ్గిపోయాయని, పని ప్రదేశాల్లో సరైన వసతులు కల్పించడం లేదని, ఎస్‌ఎంఎస్ పేరుతో కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బ్యాంకుల్లో సకాలంలో డబ్బులు పడడం లేదని, ఈ–కేవైసీ పేరుతో సతాయిస్తున్నారని తెలిపారు. పనులు గుర్తించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పని దినాలను 150 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లోనూ పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగితే ప్రభుత్వమే వైద్యం చేయించాలని, కుంటి సాకులతో కూలీలను ఇబ్బందులకు గురి చేయొద్దని, కూలీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలని, పనులను ముందే గుర్తించి గ్రామాల్లోని గ్రూపులన్నిటికీ ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బోళ్ల సాంబయ్య, మొగులోజు శారద, జిల్లా కమిటీ సభ్యులు రుద్రారపు లక్ష్మి, బస్కె మొగిలి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

● మద్యం షాపుల్లో ఎక్సైజ్ ఎస్సై తనిఖీ

రాయపర్తి (వర్ధన్నపేట) : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత మద్యం షాపుల యజమానులపై చర్యలు తప్పవని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్సై సరిత తెలిపారు. వర్ధన్నపేటలోని మద్యం షాపుల్లో, బార్ అండ్ రెస్టారెంట్లలో మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సరిత మాట్లాడారు. మద్యం షాపుల నిర్వాహకులు అవకతవకలకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే మద్యం షాపులు నిర్వహించాలని, ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎస్సై సరిత

డాక్టరేట్

నల్లబెల్లి : మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన పబ్బు సాంబయ్య–సమ్మక్క దంపతుల కుమారుడు చంద్రశేఖర్‌కు కేయూ అధికారులు డాక్టరేట్ ప్రకటించారు. చంద్రశేఖర్ అర్థశాస్త్ర విభాగంలో ‘ఆన్ అప్రైజల్ ఆఫ్ కోఆపరేటివ్స్ విస్ ఏ విస్ రూరల్ డెవెలప్‌మెంట్–ఏ స్టడీ ఇన్ సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ తెలంగాణ’ అంశంపై శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య మహ్మద్ ఇక్బాల్ అలీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు చంద్రశేఖర్‌కు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నర్సింహచారి వెల్లడించారు. చంద్రశేఖర్ ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. చంద్రశేఖర్‌కు డాక్టరేట్ రావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు అభినందించారు.

బీమాతోనే కుటుంబానికి ధీమా



అరుణకు నగదు అందజేస్తున్న జగన్నాథచారి, తదితరులు

సంగెం : బీమా చేయించుకుంటేనే కుటుంబానికి ధీమా ఉంటుందని ఏకశిల పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారి తెలిపారు. మండలంలోని కుంటపల్లికి చెందిన ఎర్రబెల్లి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంజూరైన రూ.70,402 బీమా డబ్బును నర్సయ్య సతీమణి అరుణకు జగన్నాథచారి మంగళవారం అందజేశారు. అనంతరం జగన్నాచారి మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరు సంపాదించిన దాంట్లో కొంత పొదుపు, బీమాకు కేటాయించాలని సూచించారు. తద్వారా కుటుంబాలకు భరోసా కల్పించొచ్చని చెప్పారు. నర్సయ్య పొదుపు సంఘంలో సభ్యుడైన క్రమంలో బీమా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పొదుపు సంఘం ఉపాధ్యక్షుడు చిర్ర మొగిలి, డైరెక్టర్లు చిర్ర చంద్రకాంత్, గాదె ఇన్నయ్య, చింతాకుల సురేందర్, పెంతల సంపత్, మాచపత్రి వీరభద్రయ్య, స్వరాజ్యం, బాబు, కోశాధికారి కూచన కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, తదితరులు

నెక్కొండ : మండల కేంద్రంలోని బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం బొడ్రాయికి నీళ్లతో అభిషేకం చేశారు. తొలుత వేద పండితులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, రామాలయ, ఆంజనేయ స్వామి ఆలయాల చైర్మన్లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బెజ్జెంకి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 2024–2025 విద్యాసంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశం కోసం ఆరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముజీబూర్ రెహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 22 వరకు మోడల్ స్కూల్‌లో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9553975496, 8978697147ల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దామెర : తహసీల్దార్ కార్యాలయంలో నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిల్లా రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బాబు (ఫైల్)

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటకు చెందిన గాయాల బాబు (49) ఈనెల 16న రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా బాబు సతీమణి లక్ష్మి మాట్లాడారు. తన భర్త మృతికి కారకుడైన రాయపర్తి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ యాకూబ్‌పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. బాబు రోడ్డుకు ఎడమ వైపు నిల్చుని ఉండగా ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చిన యాకూబ్ ఢీకొట్టాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..



గీసుకొండ : విద్యుదాఘాతానికి గురై మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని జాన్‌పాక వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 35–40 ఏళ్ల వయస్సుడైన వ్యక్తి ఒంటిపై బట్టలు లేకుండా పిచ్చిగా ప్రవర్తిస్తూ జాన్‌పాకలోని కావ్య పాలిమర్స్ పైపుల తయారీ కంపెనీలో తిరుగుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన గోడ ఎక్కి చేతులు పైకి లేపడంతో విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో మృతి చెందాడు. కంపెనీ యజమాని గవాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తుపడితే సెల్ నంబర్ 8712685250, 8712685240ల్లో సంప్రదించాలని సూచించారు.

వర్షాలు కురవాలని పూజ

గీసుకొండ : వర్షాలు కురవాలని కాంక్షిస్తూ మండలంలోని ఊకల్ హవేలిలోని నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని మల్లెపూలతో అలకరించి పూజించారు. జ్యేష్ఠ మాసం గ్రీష్మ రుతువు తాపాన్ని తట్టుకుని దండిగా వర్షాలు కురిపించాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనా చార్యులు, అర్చకుడు శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురంలో కమ్యూనిస్టు నాయకుడు బొమ్మగాని చిన్నవీరయ్య 11వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం బాబురావు మాట్లాడారు. చిన్నవీరయ్య ఎర్రజెండా నాయకత్వంలో ప్రజల కోసం ఉద్యమించాడని తెలిపారు. చిన్నవీరయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నాగెల్లి కొంరయ్య, స్వామిరావు, చంద్రమౌళి, మొగిలి, సాంబయ్య, ఐలోని, సుధాకర్, కొమురయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సుదర్శన నారసింహ కల్యాణం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో స్వామివారి స్వాతి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మూలవరులకు, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వయంభూ స్తంభ నారసింహుడు, గర్భాలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీనారసింహుడి ధ్రువమూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచసూక్తాలు పఠిస్తు పంచామృతాలతో అభిషేకించారు. సుదర్శన శతకం అనుసంధానిస్తు పాంచరాత్రాగమం ప్రకారం సుదర్శన నారసింహ హవనం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. లక్ష్మీ నారసింహుడు, పద్మావతి, మంగతో వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం కనులపండువగా నిర్వహించారు. నక్షత్ర హారతి సమర్పణ చేసి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. హాజరైన భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ–రాణి దంపతులు, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, సూపరింటెండెంట్ కిరణ్, డైరెక్టర్ తాడెం మోహన్, ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, లోకేష్, పూర్ణచందర్–వినీల, గుండపు వెంకట్రాంనర్సయ్య–సుభద్ర, సుదర్శనం–సరస్వతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఔదార్యం



గీసుకొండ : అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేసి ఔదార్యం చాటారు. మండలంలోని శాయంపేట హవేలికి చెందిన కొంగర సదానందం, మనుగొండకు చెందిన మాదాసి అనిల్ సతీమణి శ్యామల అనారోగ్యం బారిన పడగా వారికి చికిత్స కోసం రూ.10 వేల చొప్పున బాలకిశోర్‌రెడ్డి పంపించిన డబ్బులను నాయకుడు అల్లం మర్రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రాంబాబు, జూల రమేశ్, దాడి శివ, మాసాని ప్రకాశ్, వైదం వినోద్, కందికొండ రాజ్‌కుమార్, తోట కమలాకర్, ఎంబాడి పరమేశ్వర్ పాల్గొన్నారు.